# వైద్యోనారాయణో హరి!

"దీనికంటే తెలివైనదీ నాలుగాకులు ఎక్కువ చదువుకున్నదీ పెద్దదానికే అప్పట్లో అన్ని వేలిస్తేనేగాని పెళ్లి కాలేదు. ఘరి చదువు, ఛాయ తక్కువైన దీనికి ఆ ముక్కును కూడ అలాగే వదిలేస్తే ఎన్ని వేలు పోసినా పెళ్ళవదు, సరికదా ఆ తర్వాత జీవితాంతం దానితోపాటు మనమూ బాధపడాలి."

జానకి చెప్పేదేమిటో అర్థమవకపోలేదు నాకు. మా రెండో అమ్మాయి సుందరి చిన్నప్పుడు మెట్ల మీంచి జారిపడితే ముక్కుకు గాయమైంది. రక్తం బొటబొటా కారితే అప్పటికప్పుడు డాక్టరు దగ్గరకు పరుగెత్తి చూపిస్తే ఏదో మందు వాడి అప్పటికా గాయాన్ని మాన్పేడు. కానీ తర్వాత్తర్వాత దానికి జలుబు చేసినప్పుడల్లా ఊపిరాడక ఎంతో బాధపడేది. పదమూడేళ్ళు నిండి పెద్దపిల్ల అయ్యేక దాని శరీరంలో వచ్చే మార్పులతో పాటు ముఖంలో కూడా మార్పు కొట్టొచ్చినట్టు కనబడసాగింది.

"నిక్షేపంలాంటి పిల్ల. ఆ ముక్కు వంక రేమిటండీ? డాక్టర్‌కి చూపించకపోయారూ" అడిగేవారు ఇంటికొచ్చిన ప్రతివారూ. వంకరమాటెలా వున్నా రాత్రానాను సుందరికి రాత్రులు ఊపిరి సలపని బాధ ఎక్కువవడంతో చెవి, ముక్కు, గొంతు చూసే స్పెషలిస్టు డాక్టర్‌కి చూపించేం. ఆయనగారు సుందరి ముక్కును, గొంతునూ పరీక్షించి ఓ ముప్ఫయ్ ప్రశ్నలడిగి ముప్ఫయ్ రూపాయల ఫీజందుకుని ముక్కులోకి చుక్కల మందూ, మరో టానిక్కూ రాసి వాడమని సలహా ఇచ్చేరు.

"ఈ చుక్కల మందుతో నయమైపోతుందంటారా?" అనడిగింది జానకి వెంటనే ఆయనని.

"నయమై పోదు – ఉపశాంతి లభిస్తుందంతే" అన్నారాయన అతి నెమ్మదిగా.

"మరి.. ఆ వంకరో? ఆడపిల్ల కూడానూ. అందుకే మీ దగ్గరకు తీసుకొచ్చాం" అంది జానకి.

"దానికి ఆపరేషన్ చెయ్యాలి. ఆపరేషన్ చెయ్యాలంటే అమ్మాయికి పద్దెనిమిదేళ్ళు రావాలి" అన్నాడాయన. పద్దెనిమిదేళ్ళు వచ్చేవరకూ పెళ్ళి మాట తలపెట్టకూడదనే

గవర్నమెంటు వారి నినాద ధోరణిలో.

అంతే! అలా ఆగిపోయాం. జలుబొచ్చినపుడు చుక్కల మందు బాగానే పనిచేసేది.

మొన్న ఉగాదికి పద్దెనిమిది వెళ్ళిపోయి పందొమ్మిదేళ్ళు వచ్చేయి సుందరికి. అదుగో అప్పట్నుంచి మొదలుపెట్టింది జానకి దాని ముక్కు విషయమై. చదువు సమస్య కంటే పెళ్ళి సమస్య కంటే దానికి ముక్కు సమస్యే ముఖ్యమైపోయింది.

"మంచి డాక్టరు ఎవరున్నారో కనుక్కుని తీసుకెళ్దాం. రేపు ఫస్టుకి గుర్తు చెయ్యి" అన్నాను జానకితో.

ఊళ్ళో గవర్నమెంటు వారి పెద్దాసుపత్రి వున్నా ఆసుపత్రిలో అన్ని రకాల ప్రజలకూ అన్ని రకాలైన ఆపరేషన్లూ ఉచితంగానే చేయడానికి తగిన వసతులూ, సౌకర్యాలూ వున్నా అక్కడ పేరుకుపోయిన అశ్రద్ధో, అవినీతో... మరోటో, మరోటో వాటి కారణంగా అక్కడ సుందరికి ఆపరేషన్ జరిపించే ఆలోచనలకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది.

అసలే జ్ఞానేంద్రియాలలో ఒకటైన ముక్కు – అందులోనూ పెళ్ళి కావల్సిన ఆడపిల్ల ముక్కు – డబ్బు కోసం వెనకాడి గవర్నమెంటాసుపత్రిలో ఉచితంగా చేయిస్తే... రేప్పొద్దున జరక్కూడనిదేదైనా జరిగితే ... దాని ముక్కుతో పాటు జీవిత మార్గం కూడా వంకరైపోయే ప్రమాదముంది.

అంచేత అన్నివిధాలా ఆలోచించే ఒక నిర్ణయానికొచ్చాం. పెద్దాసుపత్రిలోని ఇ.ఎన్.టి., స్పెషలిస్టుగారికి ఇంటి దగ్గరే ముడుపు చెల్లించి అన్ని వసతులూ, పరికరాలూ వున్న పెద్దాసుపత్రిలో ఆయన చేతే (ఉచితంగా) ఆపరేషన్ చేయించాలనీ, అది ఉభయ తారకంగానూ, ఒకింత మాకే లాభదాయకంగానూ వుంటుందని ఆశపడ్డాం. అభిప్రాయ పడ్డానికీ, ఆశపడ్డానికీ బాగానే వుంది గాని అమలు జరగొద్దూ? అక్కడే చుక్కెదురైంది.

కాలేజీ లెక్చరర్లకి ఇళ్ళ దగ్గర ప్రైవేట్లూ, గవర్నమెంటాసుపత్రిలోని డాక్టర్లకు ఇళ్ళ దగ్గర ప్రైవేటు క్లినిక్కులూ వుంటాయనీ, ఆ 'ప్రైవేటు' సంపాదన అసలు సంపాదనను ఎన్నో రెట్లు మించి వుంటుందనీ జగద్విదితమే.

అంచేత గత పాతికేళ్ళుగా ప్రాక్టీసు చేస్తున్న ఇ.ఎన్.టి. డాక్టరు రామలింగం గారి ప్రైవేటు క్లినిక్కు తీసుకెళ్ళాం మా సుందరిని.

పెచ్చులూడిపోయి, మాసిన గోడలతో వున్న ఓ పెద్ద గదిని కర్టెన్ ద్వారా రెండు భాగాలుగా చేసి ఒక భాగం పేషెంట్లకూ, రెండోది తన ప్రాక్టీసుకూ కేటాయించాడాయన. అంత చదువూ చదివి గవర్నమెంటాసుపత్రిలో అంత మంచి హోదాలో వున్న ఆయన గారి పరిస్థితి చూస్తే ఎవరికైనా జాలేయక మానదు.

ఆయన సుందరి ముక్కూ, గొంతూ పరీక్షించి "ఆపరేషన్ చెయ్యాల్సిందే రేపోమారు పెద్దాసుపత్రికి తీసుకురండి. అక్కడ మరికొన్ని పరీక్షలు చేయాలి" అన్నారు.

ఆ మర్నాడు మేం ఆసుపత్రికి వెళ్ళేసరికి బయట బల్లల మీద విపరీతంగా జనమున్నారు. పావుగంట కొకరు డాక్టరుగారి గదిలోకి వెళ్తున్నారు. ముందు రోజు

డాక్టరుగారు ఇచ్చిన సలహా ప్రకారమే చిన్న చీటీ మీద పేరు రాసి లోపలికి పంపించేను. అంతే వెంటనే పిలుపొచ్చింది, లోపలికి రమ్మని.

లోపల ఈయనకాక మరో డాక్టరు కూడా వున్నారు. ఆయన సుందరిని పరీక్షించి, "సాధ్యమైనంత త్వరగా ఆపరేషన్ చేయించడమే మంచిది" అన్నారు.

ఆపరేషన్ నిమిత్తమై ఆసుపత్రిలో ఎన్ని రోజులుండాలో, చేసినందుకు డాక్టరు గారి ఫీజెంతో వివరాలు కనుక్కుందికి ఆ సాయంకాలం ఆయన ప్రైవేటు క్లినిక్‌కు వెళ్ళేను. తీరా ఆయన చెప్పిన సమాధానం విని మెదడంతా మొద్దుబారిపోయింది.

ఆ ఆపరేషన్‌కి కావల్సిన వసతులు ప్రస్తుతం గవర్నమెంటాసుపత్రిలో లేవుట. కనుక స్థానికంగా ఇటీవలే విదేశీ సాంకేతిక సహాయంతో కట్టిన ఒక డయోగ్నోస్టిక్ సెంటర్‌లోనే చెయ్యాలిట. ఆ ఆసుపత్రి పేరు కూడా చెప్పేరు. విచిత్రంగా ఆధునికంగా ఉంది. దాని గురించి వినడమేగాని ఇంతవరకూ చూళ్ళేదు నేను. సుమారుగా వారం రోజులు అందులోనే వుండాల్సి వస్తుందనీ, అంతగా తూగలేని పక్షంలో ఆపరేషన్ అయ్యాక మరో నర్సింగ్ హోంలోకి మార్పించుకోవచ్చుననీ డాక్టరుగారే సలహా ఇచ్చారు.

"తమరి ఫీజు విషయంలో కూడా చెబితే" అంటూ నసిగేను.

"ఫీజుకేముంది - బొంబాయిలో అయితే ఈ ఆపరేషన్‌కి పదివేల దాకా తీసుకుంటారు. మద్రాసులో అయితే ఏడెనిమిది వేలు అవుతుంది. మేమంత తీస్కోం. పైగా ఇక్కడైతే మీకు ఖర్చులు కూడా కలిసొస్తాయిగా" అన్నారు.

ఫీజు చెప్పి నన్ను భయపెట్టడం ఇష్టం లేకనో లేక తనే ఇంకా నిర్ధారించుకోలేదో మొత్తానికి వివరాలన్నీ ఆ రెండో డాక్టర్ని సంప్రదించి గాని చెప్పలేనన్నారు.

ఆ రాత్రి నిద్ర లేదు నాకు. ఎంత తక్కువ వేసుకున్నా అన్నీ కలిపి ఆరేడు వేలేనా వుండాలేమోననిపించింది. అప్పు చేయడం తప్ప మరో గత్యంతరం లేదు.

మర్నాడు సాయంకాలం బస్టాపులో నిల్చుంటే చిరునవ్వుతో నా దగ్గరకొచ్చాడు వెంకట్రావు. "పిలుస్తుంటే పలకవేం - నువ్వు అవునో కాదో అనుకున్నాను" అన్నాడు. ఇంటర్ వరకూ నాతో కలిసి చదువుకున్నాడు వెంకట్రావు. తర్వాత ఎం.బి.బి.ఎస్. చదివేడు. మనిషి బాగా మారిపోయాడు. నా విషయాలు అడిగి తన సంగతులు చెప్పేడు. ఎమ్మెస్ అయ్యేక గల్ఫ్‌లో ఆరేళ్ళు పనిచేసి వచ్చి ఈ మధ్యే ఇల్లూ, కారూ ఏర్పరచుకున్నాడట. కారుకేదో రిపేరుంటే ఇచ్చి వస్తున్నానన్నాడు. కాస్సేపు నా గురించీ, గవర్నమెంటు ఉద్యోగాల గురించీ తెలుసుకుని జాలిపడ్డాడు.

"పద కాస్త కాఫీ తాగుదాం" అని ఎదురుగా వున్న హోటల్లోకి దారితీశాడు.

మాటల్లో నా ప్రస్తుత సమస్య చెప్పేను. ఆత్మీయ మిత్రుడూ, అందులోనూ డాక్టరూ, అంతా విని, "చంపేశావ్. ఆ రామలింగం దగ్గరకా నువ్వెళ్ళింది? ఆయనగారికి ముక్కెక్కడుంటుందో, చెవెక్కడుంటుందో, నువ్వే చూపించాలి. అటువంటి డాక్టరు ఎం.బి.బి.ఎస్సే పన్నెండేళ్ళు చేసేడట. అతగాడికి ధైర్యం లేక మరో డాక్టర్ని సంప్రదించేడు. కేసు సక్సెస్ అవడం కష్టమే" అంటూ తేల్చేశాడు.

నాకు భయమనిపించింది.

"అయితే ఇప్పుడేం చేయమంటావో నువ్వే చెప్పు" అన్నాను. కాస్సేపు ఆలోచించి, "ఆ ఆపరేషన్ సవ్యంగా చేయగలిగింది ఈ ఊళ్ళో ఒకే ఒక డాక్టరున్నాడు. పేరు శాతకర్ణి. ఆయన నీకు దొరికి చేస్తే ఢోకా లేదు. కాకపోతే ఆయన ఫీజు కాస్త ఎక్కువే" అంటూ అతని వివరాలు రాసి ఇచ్చేడు.

"ఈ విషయంలో నా అవసరమేదేనా వుంటే చెప్పు. చెయ్యగలిగింది చేస్తాను" అంటూ వెళ్ళేటప్పుడు తన విజిటింగ్ కార్డు కూడా ఇచ్చేడు వెంకట్రావు.

కథ ఇలా మలుపు తిరుగుతుందని నేననుకోలేదు. అంతా విని, "భగవంతుడిలా ఆ వెంకట్రావు గారెవరో కనబడ్డారు కాబట్టి విషయం తెలిసింది. లేకుంటే పిల్ల భవిష్యత్తు ఏమైపోయేదో" అంటూ కాస్సేపు కన్నీళ్ళు పెట్టుకుంది జానకి.

"ఎలాగూ అన్ని వేల ఖర్చుకు సిద్ధపడుతున్నాం. హస్తవాసి మంచిదైన డాక్టరు మరో వెయ్యి ఎక్కువ పుచ్చుకుంటే మాత్రమేం? ఎలాగో ఆ శాతకర్ణిగారి చేతే ఆపరేషన్ చేయిద్దామండీ" అంది చివరికి.

నేనూ ఇంచుమించు అదే నిర్ణయానికొచ్చాను.

రెండు రోజులు పోయాక సుందరిని తీసుకుని శాతకర్ణిగారి క్లినిక్కి వెళ్ళేను.

అది క్లినిక్కా? ఇంద్రభవనానికి ఔట్‌హౌస్‌లా వుంది. పాలరాతి గచ్చులూ, డెకొరేటివ్ లాంపూ్లు. ముందు హాల్లో జనం బారులు తీరి కూర్చుని వున్నారు.

ఆశ్చర్యపోతూ అడుగు లోపలికి వేసేంతలోనే అడ్డేశాడు అక్కడున్న సెక్యూరిటీ గార్డు కార్డు చూపించమంటూనూ. కార్డేమిటని తెల్లబోయాను. డాక్టరుగార్ని చూడాలంటే ముందుగా అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేసుకుని కార్డు తీసుకోవాలట. ఆ కౌంటర్ వైపు చూపించేడు.

కౌంటర్లో అమ్మాయి రెండు రూపాయలు తీసుకుని వివరాలు రాసి ఓ కార్డిచ్చి మర్నాడు సాయంకాలం ఏడున్నరకు రమ్మంది.

మర్నాడు మేం రాగానే కార్డు చూసి సాదరంగా ఆహ్వానించి కుర్చీలో కూర్చొబెట్టేడు సెక్యూరిటీ గార్డు.

మరో పది నిముషాల్లో పిలుపు రానే వచ్చింది.

డాక్టరుగారి గదిలోకి అడుగుపెట్టగానే లోపల బోల్టు వేశాడు అక్కడున్న బోయ్. పెద్ద గదికి మధ్యలో స్క్రీన్ వుంది. స్క్రీన్ అవతల డాక్టరుగారు మరో పేషంటును చూస్తున్నారు.

అయిదు నిముషల తర్వాత డాక్టరుగారే స్వయంగా సుందరి పేరు పిలిచారు. సుందరితోపాటు నేనూ లోపలి కెళ్ళాను. తెల్లని ఉంగరాల జుట్టు, పెద్ద పెద్ద పువ్వులున్న ముదురాకుపచ్చని చొక్కా, తెలుగు సినిమాల్లో చూపించే ఇంగ్లీషు ఆఫీసర్లా వున్నారు.

వెనక్కు తిరిగి కూర్చున్నాడేమో ముఖం తిప్పి చూడకుండానే వచ్చి ఇలా కూర్చో అంటూ తన ముందున్న కుర్చీ చూపించేరు. సుందరి వెళ్ళి కూర్చుంది.

"ఏవిటీ బాధ?" అడిగారాయన అదో రకమైన యాసలో.

"చిన్నప్పుడెప్పుడో పడిపోతే ముక్కు మీద దెబ్బ....."

నా మాట పూర్తికాలేదు. ఆయన నా వంక చూసి –

"అమ్మాయికి తెలుగొచ్చునా" అడిగారు.

వచ్చున్నాను.

"నాకూ వచ్చు. తననే చెప్పనీయండి" అన్నారు.

నేనూరుకున్నాను.

ఆయనడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పింది సుందరి. అంతా విని, ముక్కు లోపల పరీక్షించి "అబ్బో పెద్ద పనే. రెండు ముక్కు సిరాలకీ మధ్యనుండాల్సిన గోడ ఎలా పక్కకొచ్చేసిందో చూశారా? అంచేతే గాలి పీల్చుకోవడానికి ఇబ్బందీ అమ్మాయికి" అన్నారు నా వైపు తిరిగి. ఆయన వెనుక నుంచీ వంగి, సుందరి ముక్కు వంక అతను చూసిన దిశగా చూశాను.

"మందులతో కుదరదు ఆపరేషన్ చెయ్యాల్సిందే. అయినా ఇన్నాళ్ళెందుకు ఆలస్యం చేశారు" అడిగారు.

"చిన్నప్పుడే చూపించాం. పద్దెనిమిదేళ్ళు రావాలన్నారో డాక్టరుగారు" అన్నాను నెమ్మదిగా.

"అవన్నీ చేతగాని వాళ్ల మాటలు. పదేళ్ళుంటే చాలు. చేసెయ్యవచ్చు. ఇటువంటివి కొన్ని వేల ఆపరేషన్లు చేశాను నేను" అంటూ ఆగి,

"మీరు ఆపరేషన్ చేయిస్తారా?" ఆనడిగారు నన్ను.

చేయిస్తామన్నట్లు నేను తలూపేక ప్రిస్క్రిప్షన్ పాడ్ తీసి, కేసంతా వివరంగా రాసి నా చేతికిస్తూ –

"రెండు రకాల ఎక్స్‌రేలూ, కొన్ని టెస్టులూ రాసేను. చేయించండి. అవికాక అమ్మాయికి మూడు రకాల బస్ట్ ఫొటోలు తీయించండి. రెండు సైడ్సూ రెండూ, ఒకటి ఎదురుగ్గానూ" అన్నారు.

"ఈ మధ్యే పరీక్షలకు తీయించినవి వున్నాయి. అవి చాలవంటారా?" అన్నాను నెమ్మదిగా.

"నో ఇవి నా టెస్టు కోసం. మీ అమ్మాయి ముక్కు మేజిక్ చేసేసి వంకర పోగొట్టి మీ సినీస్టార్ శ్రీదేవి ముక్కులా చేసేస్తానన్నమాట. మరి కంపేర్ చేయడానికి ఫోటోలుండాలిగా. అందుకూ! శుక్రవారం నాకివన్నీ చూపిస్తే సోమవారం ఆపరేషన్ చేసేద్దాం" అన్నారు.

"ఆపరేషన్‌కి ఎంతవుతుందో చెబితే...." అంటూ నసిగేను.

చెయ్యి పైకెత్తి ఐదు వేళ్ళూ తెరిచి, బొటన వేలు మూసేసి నాలుగు వేళ్ళు చూపించేరు.

"ఫోర్ థౌజెండ్. దటీజ్ మినిమమ్. ప్లస్ అనెస్థీషియన్ ఛార్జెస్ త్రీ హండ్రెడ్. ఈ

రెండూ ఆపరేషన్ చేసిననాడే ఇవ్వాలి" అంటూ ప్రిస్క్రిప్షన్ వెనుకే ఆ రెండు అంకెలూ నాకు గుర్తుండడం కోసం కాబోలు వేసి అందిస్తూ, "ఇవిగాక హాస్పిటల్ బెడ్ ఛార్జెసూ, థియేటర్ ఛార్జీ అవీ వాళ్లు వేసినంత" అంటూ ఆపరేషన్ తాను ఎక్కడ చేయదలచుకున్నదీ చెప్పేరు. అదే హాస్పిటలు – రామలింగంగారు చెప్పిన స్టార్ హోటల్‌ని పోలిన హాస్పిటలు!

మరోమాట మాట్లాడే అవకాశమివ్వకుండానే తరువాతి పేరు పిలిచేరు.

కన్సల్టేషన్ ఫీజు యాభై రూపాయలూ చెల్లించి బయటపడ్డాం.

మర్నాడే వెంకట్రావుని కలిసి జరిగింది చెప్పేను. "డోంట్ వర్రీ. అయిపోతుంది. ఫర్వాలేదు. నే చెప్పలేదూ ఆ హాస్పిటల్ తప్ప మరొకటి లేదు ఇటువంటి పెద్దాపరేషన్లు చేయడానికి. అందుకే స్పెషలిస్టులంతా దాన్నే ప్రిఫర్ చేస్తారు. గవర్నమెంటాసుపత్రులు పేరుకే. వాటినీరోజుల్లో లెక్కలోకి తీసుకోకూడదు" అన్నాడు.

ఒక డాక్టరే అలా చెప్పడం నా కాశ్చర్యాన్ని కలిగించింది.

"నేను చెబితే అక్కడ నీకు కొంత కన్సెషన్ కూడా వుంటుంది. చూద్దాంలే" అన్నాడు చివరిగా.

నాకు నిజంగా ధైర్యం కలిగింది.

ప్రావిడెంటు ఫండు అడ్వాన్సులో మిగిలిన మూడు వేలూ; రామచంద్రమూర్తి దగ్గర తీసుకున్న మరో మూడు వేలూ ప్రస్తుతం నా దగ్గరే వున్నాయి. వాటితో ఒడ్డెక్కిపోతే అదే చాలుననిపించింది.

శుక్రవారం డాక్టర్‌గార్ని కలిసి మిగతా ఏర్పాట్లు కూడా చేయడం జరిగింది.

సోమవారం ఉదయం ఏడు గంటలకి హాస్పిటల్‌కి వెళ్ళి రిసెప్షన్ కౌంటర్‌లో పేరు చెప్పగానే, "శాతకర్ణిగారి కేసు కదూ. మీకు రూం నెంబర్ 412 అలాటయింది" అని మాతో చెప్పి, ఇంటర్‌కం తీసి, "శాతకర్ణిగారి కేసు అడ్మిట్ అయింది సార్. ఆపరేషన్ థియేటర్‌కి పంపిస్తున్నాను" అని ఎవరితోనో చెప్పి బోయ్‌ని పిలిచింది.

బోయ్ మమ్మల్ని సాదరంగా లిఫ్టులో తీసుకెళ్ళేడు. పాలరాతి గచ్చులూ, డిస్టెంపర్ వేసిన గోడలూ, ఖరీదైన సోఫాలూ.

"జరిగితే జ్వరమంత సుఖం లేదనేవారు పూర్వం. ఇప్పుడీ సౌకర్యాలు చూస్తే ఇంకేమనేవారో" అంది జానకి నా చెవిలో నెమ్మదిగా.

నిజమే. మంచి వైద్యసదుపాయం, చక్కని వాతావరణం – రోగికి కావాల్సిందే ముంటుందిక? డబ్బు ఖర్చవుతున్నా ట్రీట్‌మెంట్ సరైన చోట ఇప్పిస్తున్నందుకు సంతృప్తి కలిగింది.

సుందరికి డ్రెస్ ఛేంజ్ చేసి స్ట్రెచర్ మీద థియేటర్లోకి తీసుకెళ్ళేటప్పటికి ఆసుపత్రి టైంలో సరిగ్గా ఎనిమిదైంది.

జానకీ, నేనూ బయట సోఫాలో కూర్చుండిపోయాం.

పావుగంట గడిచింది.

"లోనికి రాకూడదు" అనే బోర్డు వేలాడుతున్నా ఇతర పేషెంట్లు తాలూకూ

మనుషులు లోపలికి వెళ్ళి వస్తుండడంతో ధైర్యం చేసి నేనూ లోపలకు అడుగు పెట్టాను. హైడ్రాలిక్ డోర్ క్లోషర్స్ వున్న ఆ తలుపు వెంటనే మూసుకుపోయింది. అదో పెద్ద హాలు. రెండు మూడు స్ట్రెచర్స్ మీద పేషెంట్లున్నారు. ఓ పక్కగా సుందరి స్ట్రెచర్ వుంది. నేను దగ్గరకు వెళ్లడంతో ముఖం మీదికి నవ్వు తెచ్చుకుని – "మరో పావుగంట పడుతుందట. థియేటర్‌లోకి తీసుకెళ్ళడానికి" అంది నెమ్మదిగా.

మరో పావుగంటలో లోపల్నించి ఓ కేసు బయటకు రావడంతో సుందరిని లోపలికి తీసుకువెళ్ళేరు. నేను బయటకొచ్చి సోఫాలో కూర్చున్నాను.

సరిగ్గా గంట తర్వాత ఆయా వచ్చి పిలిస్తే ఆత్రంగా లోపలికెళ్ళేం. ఆపరేషన్ అయిపోయింది. సుందరిని స్ట్రెచర్ మీద తీసుకొచ్చి హాల్లో వుంచేరు. ముక్కు చుట్టూ పెద్ద బేండేజ్ వేసి, గాలి పీల్చుకోడానికి ఓ గొట్టం మాత్రం వుంచి ప్లాస్టర్ అంటించేరు.

ఏ కదలికా లేకుండా నిశ్చలంగా పడుకుని వున్న సుందరిని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంది జానకి.

"జనరల్ ఎనెస్టీసియా ఇచ్చేరు కదా. మరో రెండు మూడు గంటల వరకూ ఆమెకు మెలకువ రాకపోవచ్చు. కంగారు పడొద్దన్నారు డాక్టరుగారు" అని, అరక్షణం ఆగి, "ఫీజు తీసుకోమన్నారు డాక్టరుగారు. ఐదూ మూడు" అంది సిస్టర్.

"ఐదు వేల మూడొందలా" అన్నాను అర్థంగాక.

"అవును. ఎనెస్టీషియా ఫీజు మూడొందలూ, మిగతాది డాక్టరుగారి ఫీజున్నూ" అందామె.

ఒక్క క్షణం ఆశ్చర్యంలో నుంచి తేరుకోలేకపోయాను.

"మరి.. డాక్టరుగారు నాలుగు వేల మూడొందలని చెప్పారే నాతో" అన్నాను.

"నోనో మీరు సుందరి ఫాదరే కదా. నేనేం పొరబడలేదు" అంది.

ఆ రోజు డాక్టరుగారు స్వయంగా అంకెలు వేసిన ప్రిస్క్రిప్షన్ తీసి చూపించాను. ఒక్క క్షణం దాని వంక చూసి –

"అయితే అడిగొస్తానుండండి" అని లోపలకు వెళ్ళి గోడకు కొట్టిన బంతిలా తిరిగొచ్చింది.

"మేజరాపరేషన్ చెయ్యాల్సి వచ్చిందట – దాని ఫీజు ఐదువేలేనట. మీ దగ్గరిప్పుడు రడీగా లేకపోతే రెండు రోజుల్లో ఇమ్మన్నారు" అంది.

మారు మాట్లాడకుండా నా జేబులో సిద్ధంగా వుంచుకున్న నాలుగు వేల మూడొందలూ ఆమె చేతిలో పెట్టి "బేలన్స్ తర్వాతిస్తానని చెప్పండి" అన్నాను.

ఇటువంటి ఆపరేషన్లు కొన్ని వేలు చేసిన డాక్టర్‌కిది 'మేజరాపరేషన్' అవుతుందని ముందే ఎందుకు తెలియలేదో నాకంతుపట్టలేదు.

జానకి భయం భయంగా సుందరి వంకే చూస్తూ కూర్చుంది.

మరో అరగంటలో సుందరిని రూంకి తీసుకొచ్చి బెడ్ మీద పడుకోబెట్టారు. సిస్టర్ వచ్చి నాలుగు రకాల మాత్రలు అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. అరగంట తర్వాత

డ్యూటీ డాక్టరనబడే ఓ కుర్ర డాక్టరు వచ్చి, కేసంతా నా ద్వారా విని, "మరో రెండు గంటల వరకూ ఆమెనేం డిస్టర్బ్ చెయ్యకండి. బ్లడ్ కారితే కాటన్‌తో తుడవండి" అంటూ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి వెళ్ళిపోయాడు.

కడుపులో కరకరమంటుంటే బయట కొచ్చి దొరికింది తిని, కాఫీ తాగి జానకిని కూడా తీసుకువెళ్ళేను.

సాయంకాలం నాలుగ్గంటలైంది. ఆపరేషన్ జరిగి అప్పటికి ఆరు గంటలు దాటింది. డాక్టర్ ఇచ్చిన టైమూ దాటిపోయింది. కానీ సుందరికి మెలకువ రాలేదు. ఆపరేషన్ చేసిన డాక్టరూ రాలేదు. మాకు ఆందోళన ఎక్కువైంది. డ్యూటీ డాక్టర్‌కి చెబితే అనెస్తీషియా ఇచ్చిన డాక్టర్‌గారికి ఫోన్ చేశారు. ఆయన వచ్చి పరీక్ష చేసి, "ఫర్వాలేదు - అమ్మాయి కాస్త వీక్ కాబట్టి లేటవుతుంది" అని చెప్పి వెళ్ళిపోయారు.

మరో గంట గడిచినా సుందరికి మెలకువ రాలేదు. జానకి కన్నీళ్ళు పెట్టుకుంటూ కూర్చుంది. ఈలోగా శాతకర్ణిగారు వస్తున్నట్లు వార్త వచ్చింది. ఎంతో హుషారుగా మాట్లాడుతూ వచ్చారాయన. పరిస్థితి వివరించేను నేను.

"డోంట్ వర్రీ. ఆపరేషన్ చాలా బాగా చేసేను" అంటూ సుందరి దగ్గరగా వెళ్ళి గట్టిగా పేరు పెట్టి పిలిచారు. రెండు మూడు పిలుపులకి సుందరి "ఊఁ" అంటూ మూలిగింది. జానకి ముఖం కాస్త విప్పారింది.

"కంగారేం లేదు. కాస్సేపట్లో ఆమెకు మత్తు పూర్తిగా వదిలిపోతుంది. రాత్రికి లిక్విడ్ డయట్ ఇవ్వండి. రేపు ఉదయం వచ్చి చూస్తాను" అని, వెళ్ళిపోబోతూ వెనక్కు వచ్చి, "రాత్రి... ముక్కులో పెట్టిన గొట్టం నించి గాలి వస్తున్నదీ లేనిదీ చూడండి. అది ముఖ్యం. ఒకవేళ గాలి రాని పక్షంలో సిస్టర్‌కి చెబితే 'సక్షన్' చేస్తారు. ఓ.కే" అంటూ వెళ్ళిపోయారు.

మరో అరగంటలో సుందరి కళ్ళు విప్పింది.

సరిగ్గా అదే సమయంలో, "ఎలా వుంది మీ బేబీ" అంటూ వచ్చేడు వెంకట్రావు. అతనితోపాటు హెడ్ నర్సూ, మరొకరూ కూడ ఉన్నావు. దాన్ని బట్టి అతనికిక్కడ ఎంత పలుకుబడుందో అర్థమైంది.

"ఇప్పుడే మెలకువ వచ్చింది" అన్నాను.

కేస్ షీటు చూసి, సిస్టర్‌కేదో చెప్పేడు. వాళ్ళు వెళ్ళేక అన్నాడు.

"నేను రావడం వీలవక ఉదయం శాతకర్ణిగారికి ఫోన్ చేసి చెప్పేను కేర్ తీసుకోమని"

ఆ మాటలు వింటూంటే నాకేదో లీలగా అర్థమవసాగింది.

"ఫీజు పే చేసినట్టేనా" అని వెంకట్రావు అడిగిన ప్రశ్నకి ఫీజు వెయ్యి రూపాయలు పెంచిన సంగతి చెప్పక తప్పలేదు.

"ఈజిట్?" అంటూ ఓ క్షణం అప్పర్యపోయి,"తిక్కముండాకొడుకు. నేను రికమెండ్ చేశానని పెంచి వుంటాడంటావా? అయి ఉండదులే. నిజంగా ఆపరేషన్ కష్టమయ్యే

వుంటుంది. ఏమైనా మంచి హస్తవాసిగల డాక్టరు" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు. కాస్సేపుండి వెళ్ళిపోతూ అన్నాడు.

"ఫీజు విషయం నేను కనుక్కుంటాలే. నువ్వేం వర్రీ కాకు. నాలుగు రోజుల్లో ఎలాగూ డిశ్చార్జి చేసేస్తారుగా. అప్పుడు అడుగుదాం."

నేను తలూకెట్టి ఊరుకున్నాను.

ఆ రాత్రి సుందరితో పాటు జానకి, నేను కూడా అక్కడే ఉండడానికి నిశ్చయించుకున్నాం. గెస్టు కోసం అక్కడున్నది ఒకే ఒక సోఫా. సిస్టర్‌ని అడిగితే -

"సాధారణంగా పేషెంట్ దగ్గర ఇద్దర్ని అలవ్ చెయ్యరు. పర్మిషన్ తీసుకుని అడిషనల్‌గా యాభై రూపాయలు కట్టాల్సి వుంటుంది" అంది.

పర్మిషన్ కోసం కిందికి వెళ్తూంటే ఎవరో ఒక పేషెంట్‌ని వీల్స్ ఛైర్‌లో కూర్చోపెట్టి మెట్ల మీంచి మోసుకొస్తున్నారు వార్డ్ బోయ్‌లు.

"అదేం? లిఫ్ట్ ఉందిగా" అడిగాను అనుమానంగా.

"ఉంది గానీ, అది డాక్టర్లకే" అన్నాడు బోయ్.

"అదేం కాదులెండి. అలా చెప్పి మోసుకొస్తే వీళ్ళకి ఐదో పదో కిడతాయి మోసినందుకు. ఇక్కడంతా ఇదే తంతు" అన్నాడు నా వెనకే వస్తున్న ఓ ముసలాయన.

ఆ రాత్రి ఇంచుమించు జాగరణే అయింది మాకు.

పది గంటలకు ఓ రెండు మాత్రలు మింగించి వెళ్ళిందో నర్సు. అంతే. అర్ధరాత్రి ముక్కులో పెట్టిన గొట్టాంలో గాలి రాకపోతే డ్యూటీ డాక్టర్ని కలిసి చెప్పాను 'సక్షన్' చెయ్యాలేమోనని.

అతను కొత్తవాడవడం వల్ల కేసంతా మళ్ళీ నా ద్వారా విని "శాతకర్ణిగారు చెయ్యమని చెప్పేరా, లేకపోతే ఆయనతో చిక్కు" అని సంశయించి 'సక్షన్' చేశాడు.

ఉదయానికి సుందరి కాస్త కోలుకుంది. పది గంటలకు శాతకర్ణిగారే వచ్చి డ్రస్సింగ్ చేశారు.

ఆ మధ్యాహ్నం సుందరికి లిక్విడ్ డయట్ ఇచ్చి జానకిని ఇంటికి పంపి సోఫాలో కూర్చున్నాను. చిన్న మాగన్ను పట్టింది.

ఒక్కసారి పెద్దగా కేకలు వినిపిస్తే తుళ్ళిపడి లేచి కారిడార్‌లోకి వెళ్ళి చూశాను. ఎవరో కొత్తగా చేరిన పేషెంటు. ఇస్త్రీ దుప్పటికి బదులు ఎవరో మరో పేషెంటు ఖాళీ చేసిన బెడ్ మీది దుప్పటిని తెచ్చి వేస్తున్నాడని అరుస్తున్నాడు. ఈలోగా స్టాఫ్ నర్స్ వచ్చి వారికి సర్దిచెప్పి ఇస్త్రీ దుప్పటి వేయించింది.

ఇక్కడ కూడా ఇటువంటివి జరుగుతుంటాయా అని ఆశ్చర్యపోయేను. అప్పుడు గుర్తొచ్చి స్టాఫ్ నర్స్‌ని అడిగేను. సుందరికి ఉదయం నించీ ఎవరూ టాబ్‌లెట్స్ వచ్చి వేయలేదని.

"సారీ అండీ. సిస్టర్స్ అంతా బిజీగా వున్నారు" అంటూ తనే వచ్చి ఏయే టాబ్‌లెట్స్ ఎప్పుడెప్పుడు వెయ్యాలో చెప్పి, "మీరు ఎడ్యుకేటేడేగా. వేళ ప్రకారం గుర్తుంచుకొని

వేసెయ్యండి" అని వెళ్ళిపోయింది.

డ్యూటీ ప్రకారం చెయ్యాల్సింది కూడా మర్చిపోకుండా చెయ్యని నర్సుల బిజీ ఏమిటో నా కర్థం కాలేదు. మధ్యాహ్నం ఫ్లాస్క్‌తో కాఫీ తెస్తూ చూద్దునుగదా, ఇద్దరు నర్సులు డ్యూటీ డాక్టరుతోనూ, మరో ఇద్దరు ఫార్మసిస్టుతోనూ కబుర్లు చెబుతున్నారు తీరుబడిగా కూర్చుని.

ఆ విషయమే వెంకట్రావుతో అంటే, "ఏం చేస్తాం చెప్పు. వాళ్ళకి నెలకి ఎనిమిది వందలిస్తారు. రోజుకి ఎనిమిది గంటల డ్యూటీ. ట్రెయినింగు పూర్తయి గవర్నమెంటు ఉద్యోగాలు రానివాళ్ళంతా మొదట ఇందులో చేరుతూంటారు" అన్నాడు.

వాళ్ళ తరపునించి ఆలోచిస్తే జాలేసింది. ఎంత మానవసేవ చెయ్యాలని ఇటువంటి ఉద్యోగాల్లోకి వచ్చినా, పనికి తగ్గ రెమ్యూనరేషన్ వుండాలిగా.

ఆ మర్నాడు సుందరి ముక్కు క్లీన్ చేసి డ్రస్సింగ్ పూర్తిగా తీసేశారు శాతకర్ణిగారు. ముక్కు కాస్త వాచి వుంది తప్పితే మరేం లేదు.

థియేటర్ నుండి వస్తూ చూశాను. ఎవరో పదహారేళ్ళ అమ్మాయి ఆపరేషన్ గౌను వేసుకోవడానికి అల్లరి పెడుతోంది.

"గౌను వేసుకోనని నేననట్లేదు - అది మాత్రం వద్దు. ఆ గౌను ఇప్పుడే మరో మగాయన వంటి మీంచి తీశారు. అది నేను చూశాను. ఆసుపత్రిలోనే శుభ్రత లేకపోతే ఎలా" అంటోందా అమ్మాయి.

"మరోటి లేదమ్మా. ఈ రోజు ఆపరేషన్లు ఎక్కువ" నచ్చచెబుతోంది ఆయా.

చూసీ చూడనట్టు వచ్చేసినా నా చెవుల్లో ఆ అమ్మాయి అన్న మాటలే వినిపిస్తున్నాయి.

నిజమే. వేల మీద ఛార్జి చేస్తూ ఇటువంటి కక్కుర్తేం వీళ్ళకి అనిపించింది.

మూడో రోజుకే సుందరి బాగా రిలీఫ్ ఫీలయింది. ఇంటికి ఆసుపత్రికి తిరగలేక నేనూ జానకీ నానా ఇబ్బందులూ పడుతున్నాం.

"డ్రస్సింగ్ కూడా తీసేశారు. నర్స్ వచ్చి ఇంజక్షన్ ఇచ్చే అవసరం ఎలాగూ లేదు. మందులు వేళ ప్రకారం మనమే వేసుకుంటున్నాం. ఇక ఇక్కడెందుకూ" అంది సుందరి ఆ మధ్యాహ్నం.

శాతకర్ణిగారిని అడిగితే ఏమంటారో! వెంకట్రావుతో అంటే, "మరొక్కరోజు ఓపిక పట్టండి ఆ తర్వాత వుంచమన్నా వుంచరు" అన్నాడు.

నాలుగో రోజు డిశ్చార్జి కోసం డాక్టరుగారి దగ్గరకు వెళ్తుంటే వెంకట్రావు ఎదురొచ్చాడు.

"ఉదయం శాతకర్ణిగారు కలిస్తే ఫీజు విషయం అడిగేను. కాంప్లికేషనేదో ఎదురై మేజరాపరేషన్ అయిందట. అందుకని ఎక్స్‌ట్రా ఛార్జ్ చేయ్యాల్సి వచ్చిందట" అన్నాడు.

"పోన్లే. దిగేక తప్పదుగా" అంటూ శాతకర్ణిగారి దగ్గరకు వెళ్ళేను. నేనిచ్చిన బేలన్సు వెయ్యి రూపాయలూ టేబిల్ మీద పడేసి, "మీరు ఇవ్వలేని పక్షంలో ఆ సంగతి

నాతో చెప్పాలి. నలుగురితోనూ చెప్పిస్తే సమస్య పరిష్కారమవదు" అన్నాడు గొంతును కోపంగా మార్చి.

"సారీ సర్!" అన్నాను నెమ్మదిగా.

"ఓ.కే. మీకీరోజు డిశ్చార్జి ఇవ్వడం లేదు. ఆమె ఇంకా రెండు రోజులు నా అబ్జర్వేషన్‌లో వుండాలి" అన్నాడు.

నేను శిలాప్రతిమలా నిలబడిపోయాను. వెంకటరావు జోక్యమే ఇంత పని చేసిందా అనిపించింది.

"అమ్మాయి ఇక్కడ ఉండలేకపోతోంది. మీరెప్పుడు తీసుకురమ్మంటే అప్పుడు తీసుకొస్తాం".

నా మాట పడనివ్వలేదాయన.

"తర్వాతేమైనా కాంప్లికేషన్స్ వస్తే నేను బాధ్యుణ్ణి కాను. మీ ఇష్టం" అన్నాడు.

నేను ఒప్పుకోక తప్పలేదు.

సంగతి విని వెంకట్రావు ఆశ్చర్యపోయేడు.

"హి ఈజె పర్‌ఫెక్ట్ డాక్టర్. బట్... మానవత్వం లేని" అన్నాడు.

ఆ తర్వాత తెల్సింది హాస్పిటల్ ఛార్జీల్లో కూడా డాక్టర్లకు పర్సంటేజెస్ వుంటాయని.

రెండు రోజుల తర్వాత ఆసుపత్రి బిల్ చూసి తల తిరిగిపోయింది నాకు. ఆర్రోజులకీ మూడు వేల ఎనిమిది వందలైంది. వెంకట్రావు కల్పించుకోవడం వల్ల రెండొందలు తగ్గింది. వివరాలు చూద్దును గదా – ఆపరేషన్ థియేటర్ ఛార్జీలు గంటకు ఎనిమిది వందల చొప్పున రెండు గంటలకు వుంది. నిజానికి ఆపరేషను థియేటర్‌లో జరిగింది గంట మాత్రమే. బయట వెయిట్ చేసిన టైంని కూడా లెక్కలోకి తీసేసుకున్నారు.

"ఇటువంటి ఆసుపత్రులలోకి మన వంటి వారు రావడమే పెద్ద పొరపాటు. ఇప్పుడనుకుంటే ఏం లాభం" అంది జానకి.

ఎలాగో... వెంకట్రావు చూపిన చొరవ వల్ల అందులోంచి బయటపడగలిగాం.

సుందరి ఇప్పుడు పూర్వంలా ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడడం లేదు. ఆమె ముక్కు కుండే వంకర కూడా పోయింది. ఆ విషయంలో సంతృప్తిగానే ఉంది.

అయితే –

ఆ రోజు తర్వాత ఆ ఆసుపత్రి ముందు నించి ఎప్పుడూ వెళ్ళినా నా మనసు పొరల్లో దాగిన బాధ ఒక్కమారు ఆవేదన రూపంలో, బయటకు పొంగుకొస్తుంది.

మానవసేవే ధ్యేయంగా ఏర్పడ్డ ఈ వైద్య వ్యవస్థలో ఇటీవలి కాలంలో పొటమరిస్తున్న కొన్ని వంకర్లనూ, రాచపుళ్ళనూ కూడా ఏ శస్త్ర చికిత్స ద్వారానో తొలగించి, చక్కదిద్దగలిగే నరనారాయణులు ఉద్భవిస్తే ఎంత బావుణ్ణు అన్పిస్తుంది.

స్వాతి మాసపత్రిక